## క్లుప్తంగా

### కానిస్టేబుల్‌పై దాడి కేసులో నిందితుడికి జరిమానా

**కొలిమిగుండ్ల (అవుకు):** విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌పై దాడి చేసిన వ్యక్తికి బనగానపల్లె కోర్టు గురువారం రూ.5వేలు జరిమానా విధించింది. అవుకు మండలం గుండ్లశింగవరం ఉన్నత పాఠశాలలో 2019 సెప్టెంబర్ 1వ తేదీన మహిళా అభ్యర్థులకు సచివాలయ పరీక్షలు నిర్వహించారు. ఆ సమయంలో పరీక్షా కేంద్రం వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు. అవుకు పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ సూర్యప్రకాష్ అక్కడ బందోబస్తు విధుల్లో ఉన్నాడు. నంద్యాల మండలం మునగాల గ్రామానికి చెందిన గోవిందిన్నె వెంకటేశ్వరరెడ్డి పరీక్ష రాస్తున్న భార్య ఉంటున్న గదిలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా విధుల్లో ఉన్న గ్రామ వలంటీర్ తిరుమలేష్, కానిస్టేబుల్ సూర్యప్రకాష్ అడ్డుకొని లోనికి అనుమతి లేదని బయటకు వెళ్లాలని సూచించారు. అయితే కానిస్టేబుల్ మాటలను లెక్క చేయకుండా వెంకటేశ్వరరెడ్డి ఘర్షణకు దిగి యూనిఫాంలో ఉన్న కానిస్టేబుల్ కాలర్ పట్టుకొని విధులకు ఆటంకం కలిగించాడు. ఈ ఘటనకు సంబంధించి అప్పట్లోనే కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. ఈ కేసుపై కోర్టులో విచారణ పూర్తి కాగా బనగానపల్లె కోర్టు న్యాయమూర్తి వెంకటేశ్వరరెడ్డిని దోషిగా నిర్ధారించి రూ.5వేలు జరిమానా విధిస్తూ తుది తీర్పు ప్రకటించారు.

### అనారోగ్యంతో మహిళా ఏఎస్‌ఐ మృతి

నిమ్మపాటి లక్ష్మిదేవి(ఫైల్)

**కర్నూలు:** కర్నూలు పోలీస్ కంట్రోల్ రూమ్‌లో(పీసీఆర్) ఏఎస్‌ఐగా పనిచేస్తున్న నిమ్మపాటి లక్ష్మిదేవి(58) అనారోగ్యంతో మృతిచెందారు. ఈమె స్వస్థలం కల్లూరు మండలంలోని పుసులూరు బొల్లవరం. 1991లో లక్ష్మిదేవి కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో చేరారు. ఏడాది కాలంగా షుగర్ వ్యాధితో బాధ పడుతుండగా.. ఇటీవల షుగర్ అధికమై కాలి పాదం తొలగించారు. ఇదే సమయంలో వైద్యపరీక్షలు నిర్వహించగా క్యాన్సర్ ఉన్నట్లు బయటపడింది. దీంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు. కోలుకోలేక గురువారం మృతి చెందారు. సాయంత్రానికి మృతదేహం కర్నూలుకు తీసుకొచ్చారు. సుంకేసుల రోడ్డులోని హిందూ శ్మశాన వాటికలో శుక్రవారం పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

### నాటుసారా స్థావరాలపై దాడులు

బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం

**బనగానపల్లె రూరల్:** బనగానపల్లె ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో నాటుసారా స్థావరాలపై నంద్యాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ టాస్క్ ఫోర్స్ (ఈఎస్‌టీఎఫ్) సీఐ లక్ష్మిదాస్ ఆధ్వర్యంలో గురువారం దాడులు జరిగాయి. పసుపల తండా, చిన్నరాజుపాలెం, తండా గ్రామాల్లో నాటుసారా తయారీ అనుమానితుల ఇళ్లలో తనిఖీ చేయడంతో పాటు అలేబాద్‌తండా గ్రామంలోని కొండల్లో నాటుసారా తయారీకి మూడు డ్రమ్ముల్లో సిద్ధంగా ఉన్న బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని జిల్లా డీపీఈఓ, ఏఈఎస్ ఆదేశాల మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఓబులేసు, నాగరాజు, డీసీ కృష్ణయ్య, రవికుమార్, పాములేటి తదితరులు పాల్గొన్నారు.

### గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం

**ఓర్వకల్లు:** మండలంలోని పోమయాజులపల్లె గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానిక ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ఎదురుగా రోడ్డుదాటుతుండగా తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. గుర్తుతెలియని వ్యక్తి అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి వయస్సు సుమారు 30–35 ఏళ్ల మధ్య ఉంటుంది. కుడిచేతికి పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మార్చురీ గదిలో భద్రపరచినట్లు పోలీసులు తెలిపారు.

### కొమరం భీం జయంతి

**శ్రీశైలంప్రాజెక్ట్:** గిరిజన హక్కుల పోరాటధీరుడు కొమరంభీం జయంతి శ్రీశైలం ప్రాజెక్ట్‌లో గురువారం నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్‌లో కొమరం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొమరం భీం ఆదివాసి సేవా గిరిజన సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు వై.ఆశీర్వాదం మాట్లాడుతూ.. బ్రిటిష్ పాలకులు పెట్టుబడిదారి తనంతో హక్కులను కాలరాస్తుంటే గిరిజనుల హక్కుల కోసం పోరాడిన ధీరుడు కొమరంభీం అని అన్నారు. గిరిజన సంక్షేమ సంఘం నాయకులు లక్ష్మి, చెవుల మల్లికార్జున, కుడుముల చిన్నోడు, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

---

# రక్తమోడిన దేవరగట్టు

- ఒకరు మృతి..100 మందికి పైగా గాయాలు
- మెరుగైన చికిత్స కోసం ఆలూరు, ఆదోనికు తరలింపు

సింహాసన కట్ట మీద కొలువుదీరిన ఉత్సవమూర్తులు

**హొళగుంద:** బన్ని ఉత్సవంలో ఆది నుంచి వస్తున్న ఆచారమే నడిచింది. పోలీస్ నిబంధనలు, అధికారుల ఆదేశాలను పట్టించుకోలేదు. విజయదశమిని పురస్కరించుకుని హొళగుంద మండలం దేవరగట్టులో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు కర్రల సమరం సాగింది. ఆలూరు పట్టణం ఇందిరానగర్‌కు చెందిన పోత రాజు(32) అనే వ్యక్తి మృతి చెందాడు. మొత్తం 100 మందికి పైగా గాయపడగా చికిత్స కోసం ఆదోని, ఆలూరు, కర్నూలుకు తరలించారు. తీవ్రంగా 25 మంది గాయపడగా.. మలకన్న, శరబన్న, వరుకు రామ్, గణేష్, రామాంజనేయులు నాయుడు తదితరల పరిస్థితి విషమంగా ఉంది. వీరిని ఆలూరు, ఆదోనికి 108, 104 అంబులెన్స్‌లో తరలించారు.

**లక్షన్నరకు పైగా భక్తులు**

బుధవారం అర్ధరాత్రి ప్రారంభమైన మాళ మల్లేశ్వర స్వామి జైత్రయాత్ర గురువారం ఉదయం వరకు సాగింది. నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులతో పాటు దేవరగట్టు చుట్టు పక్కల గ్రామాలైన నిట్రవట్టి, బిలేహాల్, విరుపాపురం, ఎల్లార్తి, సుళువాయి, అరికెర, అరికెరతాండా, కురుకుంద, సమ్మతగేరి, పెద్దహ్యాట, హెబ్బటం, లింగంపల్లితో పాటు దాదాపు 15 గ్రామాలకు చెందిన భక్తులు ఉత్సవంలో పాల్గొని మొగలాయి ఆడారు. బన్ని ఉత్సవాన్ని తిలకించేందుకు కర్ణాటక, ఆంధ్రా, తెలంగాణ నుంచి లక్షన్నరకు పైగా భక్తులు తరలి వచ్చారు.

**పటిష్ట బందోబస్తు ఉన్నా..**

మృతి చెందిన పోతరాజు

ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో ఆదోని ఏఎస్పీ జయశర్మ పర్యవేక్షణలో ఆదోని, నంద్యాల, కర్నూలు, డోన్, తదితర ప్రాంతాలకు చెందిన డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లతో పాటు ప్రత్యేక బలగాలు వచ్చాయి. మహిళా పోలీసులు, స్పెషల్ పార్టీలతో కలిసి మొత్తం కలిసి వెయ్యి మందితో పటిష్ట బందోబస్తు ఉన్నా కర్రల సమరం ఆగలేదు. వందల సంఖ్యలో సీసీ కెమెరాలు, ఐదు డ్రోన్ కెమెరాలు, దాదాపు 800 వరకు భారీ వెలుతురు ఇచ్చే లైట్లను ఏర్పాటు చేసి పోలీస్ కంట్రోల్ రూం ద్వార ఎప్పటికప్పుడు పరిస్థితి ని సమీక్షించినా దేవరగట్టు రక్తమోడింది.

కర్రల సమరం

**బన్ని ఉత్సవం సాగింది ఇలా..**

- ➤ బసవన్నగుడి సమీపంలో తిష్టవేసిన అరికెరకు చెందిన భక్తులు అలజడి సృష్టించారు.
- ➤ విగ్రహాలు, పల్లకీని పాదాల గట్టు వైపు వెళ్లిన సమయంలో అగ్గి కాగడాలు, రాళ్లు విసిరారు.
- ➤ రింగు కర్రలు, దివిటీలతో దాడి చేయడంతో చాలా మందికి గాయాలయ్యాయి.
- ➤ అరికెర, ఇతర గ్రామాల భక్తుల మధ్య గంట పాటు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది.
- ➤ విగ్రహాలు, పల్లకీ రాక్షసపడి గుండ నుంచి శమీవృక్షం వద్దకు తీసుకెళ్లారు.
- ➤ శమీవృక్షం మీదుగా ఎదురు బసవన్న గుడి వైపునకు వెళ్లారు.
- ➤ ఆలయ పూజారి గిరిస్వామి భవిష్యవాణి (కార్ణీకం) వినిపించిన అనంతరం ఉత్సవమూర్తులను మల్లప్ప గుడిలోని సింహాసన కట్టమీద అధిష్టింపజేశారు.
- ➤ భక్తులు దప్పుళ్లు కొట్టే ఇళ్లకు తిరుగు ప్రయాణమయ్యారు.

**నేడు రథోత్సవం**

దేవరగట్టులో శుక్రవారం సాయంత్రం మాళ మల్లేశ్వరస్వామి రథోత్సవం ఘనంగా జరగనుంది. శనివారం గొరవయ్యల ఆటలు, గొలుసు తెంపుట, దేవదాసీల క్రీడోత్సవం, సాయంత్రం వసంతోత్సవం, కంకణ విసర్జన ఉంటాయి. ఆదివారం మాళ మల్లేశ్వర స్వామి విగ్రహాలు నెరణికి గ్రామానికి చేరడంతో ఉత్సవాలు ముగుస్తాయి.

### వర్షాలు ఉండవు.. ధరలు పెరుగుతాయి!

- భవిష్యవాణి వినిపించిన ఆలయ పూజారి


ఆలయ పూజారి గిరిస్వామి

**హొళగుంద:** వర్షాలు ఉండవని, ఆకాశం మేఘావృతం అయినా ఆశలు పెంచుకోవద్దని, ధరలు పెరుగుతూనే ఉంటాయని, తగ్గే పరిస్థితి ఉండబోదని పూజారి తన కార్ణీకంలో వివరించారు. దేవరగట్టు దసరా బన్ని ఉత్సవంలో ఆలయ పూజారి గిరిస్వామి బసవన్నగుడి పైకెక్కి డిర్ర్‌ర్ర్.. బహుపరాక్ అంటూ భవిష్యవాణి వినిపించాడు. మల్లెగువ్వే ఐందే గంగి, మాళ సింతాళ హెచ్చర.. 7,900 సగ్గొ..(పత్తి).. 3,400 ఒక్కకలోళ(జొన్న).. 3–6, 6–వర్ధాదితు ..అని అన్నారు. మల్లెపూవులా కనిపించినా అది మల్లె పూవు కాదని, వర్షాలు వచ్చే నట్లే కనబడ్డున్నా వర్షాలు కురవవని, మంచితనం ముసుగులో కనబడని చెడు దాగి ఉంటుందని హెచ్చరా అనే అర్థంతో భవిష్యవాణి ఉన్నట్లు పలువురు పెద్దలు తెలిపారు. అలాగే పత్తి రూ.7,900, జొన్న రూ.3,400 ధర పలుకుతుందని, ఆహార పదార్థాలు, నిత్యావసర సరకులు, పంటలకు గిట్టుబాటు ధర తక్కువ నుంచి పెరిగి ఇంకా పెరుగుతూనే ఉంటుందని తెలియజేసేలా 3:6, 6–వర్ధాదితు అని భవిష్యవాణిని వినిపించి ముగించాడు.

---

# అబద్ధాల చంద్రబాబును ఓడిద్దాం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలులోని శ్రీరామనగర్‌లో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**కర్నూలు (టౌన్):** అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిద్దామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. కర్నూలు 28వ వార్డు పరిధిలోని శ్రీరామనగర్, సీ.క్యాంపు క్వార్టర్స్, మద్దూర్‌నగర్ ప్రాంతాల్లో గురువారం వైఎస్సార్‌సీపీ మేయర్ అభ్యర్థి సుశీల, కార్పొరేటర్ అభ్యర్థి బత్తుల రీటా స్వర్ణలతతో కలిసి పార్టీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షురాలు ఎస్వీ విజయ మనోహరి, కర్నూలు పార్లమెంటరీ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరిగి చంద్రబాబు మోసాలు వివరించారు. ఆడబిడ్డ నిధి ఇచ్చారా.. 50 సంవత్సరాలు దాటితే బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలందరికీ రూ. 4 వేలు పెన్షన్ ఇచ్చారా.. అని ఓటర్లను అడిగారు. చంద్రబాబు మాటలు నమ్మి మోసపోయామని ప్రజలు చెప్పారు. ఈ సందర్భంగా ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇచ్చిన ప్రతి హామీని జగనన్న అమలు చేస్తే, ఎన్నో అబద్ధాలు చెప్పి చంద్రబాబు అధికారంలోకి వచ్చారన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు ఎగొట్టారన్నారు. పేదలను, సామాన్యులను, మధ్య తరగతి ప్రజలను, మహిళలను మోసం చంద్రబాబును ఓడిద్దామన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు వేస్తుంటే చంద్రబాబుకు ఎందుకంత భయమని ప్రశ్నించారు. ప్రజలు ఆలోచించాలని, సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసిన వైఎస్సార్‌సీపీ మేయర్, కార్పొరేటర్ అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు.

### జిల్లా కలెక్టర్ పేరు, ఫొటోతో నకిలీ ఫోన్ కాల్స్

**కర్నూలు (సెంట్రల్):** జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి పేరు, ఫొటోను దుర్వినియోగం చేస్తూ కొంతమంది అపరిచిత వ్యక్తులు నకిలీ ఫోన్ కాల్స్ ద్వారా డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. మోసపూరిత కాల్స్‌పై ప్రజలు, అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి సూచించారు. కలెక్టర్ ఫొటోను ప్రొఫైల్ పిక్చర్‌గా ఉపయోగిస్తూ 8107487296 అనే ఫోన్ నంబర్ నుంచి పలువురికి కాల్స్ చేసి, రూ.30,000 వరకు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. మోసపూరిత కాల్స్ , సందేశాలు అందినట్లయితే సంబంధిత ఆధారాలను భద్రపరచుకుని పోలీసులకు ప్రజలు ఫిర్యాదు చేయాల్సి ఉంది.

# వైఎస్సార్‌సీపీ నాయకుల హౌస్ అరెస్ట్

వెల్దుర్తిలో హౌస్ అరెస్టు చేసిన దృశ్యం

ఎల్ నగరంలో..

**వెల్దుర్తి:** నామినేషన్లు వేసేందుకు వెళ్లకుండా వైఎస్సార్‌సీపీ నాయకులను గురువారం తెల్లవారుజాము నుంచే పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డిని వెల్దుర్తిలోని ఆయ స్వగృహంలో, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎల్ నగరం గ్రామ సమీర్ కుమార్ రెడ్డి అతని స్వగృహంలో హౌస్ అరెస్టు చేశారు. గురువారం మధ్యాహ్నం నుంచి నామినేషన్లు వేసేందుకు అవకాశాలు ఇస్తామని సాయంత్రం వరకు వదల్లేదు. వెల్దుర్తి మండలంలో ఉన్న 17 ఎంపీటీసీ స్థానాలలో కేవలం చెరుకులపాడు స్థానంలో నామినేషన్ వేశారు. మిగతా 16 ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్ వేయాలనుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుల, కార్యకర్తల ఆశలకు గండికొట్టారు. శుక్రవారం అయినా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను పోలీసులు నామినేషన్లు వేయిస్తారో లేదో చూడాలి.

# అక్రమ మద్యం నివారణకు ‘టాస్క్‌ఫోర్స్’ తనిఖీ

చెక్‌పోస్టులో వాహన తనిఖీలను పరిశీలిస్తున్న స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారి రఘుమా రెడ్డి

**కర్నూలు:** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం జిల్లాలోకి రవాణా కాకుండా నివారించేందుకు స్టేట్ టాస్క్ ఫోర్స్ అధికారి ఎక్సైజ్ చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ సీఐ చంద్రహాస్‌తో కలిసి గురువారం కర్నూలు శివారులోని పంచలింగాల చెక్‌పోస్టు, సుంకేసుల వద్ద ఉన్న ఎక్సైజ్ చెక్‌పోస్టులను ఆయన సందర్శించారు. వాహన తనిఖీలు జరుగుతున్న తీరును పరిశీలించారు. విజయవాడ నుంచి వచ్చిన ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ సూపరింటెండెంట్ రఘుమారెడ్డి ఆధ్వర్యంలో కొద్దిసేపు ఆయా చెక్‌పోస్టులలో వాహన తనిఖీలు జరిగాయి. మద్యం అక్రమంగా తరలించే వారిపై కేసు నమోదు చేసి కట్టడికి చర్యలు తీసుకోవాలని అక్కడున్న సిబ్బందికి సూచించారు. పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం రవాణా కాకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, వాహన తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలని ఆయన సిబ్బందికి సూచనలు చేశారు. విశ్వేశ్వరరావు, మునిస్వామి, నవీన్, తదితరులు పంచలింగాల చెక్‌పోస్టులో విధులు నిర్వహించారు.

### పిల్లాపాపలతో..

పెద్దకడబూరు మండలం బాపులదొడ్డి గ్రామం నుంచి గురువారం 30 కుటుంబాల వారు పిల్లా పాపలతో కలసి లారీలో వలస వెళ్లారు. పనులేక వలస వెళ్తున్నట్లు గ్రామస్తులు శ్రీరాములు, రామిరెడ్డి, అంజినేయ, మహాదేవ, వెంకటేశులు, నాగమ్మ, మహాదేవమ్మ, నరసమ్మ, అనిత తదితరులు చెప్పారు.

–పెద్దకడబూరు

### ఊరు విడిచిన రైతులు



టెంపోలో వలస వెళ్తున్న వీరు మహిళా రైతులు. గురువారం ఒక్క రోజే ఎనిమిది వాహనాల్లో 400 మంది వరకు తెలంగాణలో పత్తి పంట తీయడానికి వలస వెళ్లినట్లు వారు తెలిపారు. పంటలు పండితే తమకు ఈ దుస్థితి ఉండేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో రైతుల ఓట్లు అవసరం లేదని చంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

–పెద్దకడబూరు

### వలస బండి కదిలింది!

వ్యవసాయ పనులేక తెలంగాణ రాష్ట్రానికి వలస వెళ్తున్న వీరు పెద్దకడబూరు మండలం జాలవాడి గ్రామానికి చెందిన వారు. గురువారం ధీరలింగేశ్వర స్వామిని దర్శించుకుని బయలు దేరారు. గ్రామంలో పంటలన్నీ ఎండిపోయాయని, పనులు లేకపోవడంతో వలస వెళుతున్నట్లు తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వం కరువు మండలాలు ప్రకటించకపోవడంతో గ్రామానికి చెందిన 50 కుటుంబాలు వలస వెళ్తున్నట్లు చెప్పారు.

– నందవరం

### నాలుగేళ్లు.. 24 వేళ్లు



సాధారణంగా మనిషిలో ఒక చేయిలో ఒక కాలికో ఆరు వేళ్లు ఉండటం చూసి ఉంటాం. అయితే ఓ బాలుడికి కాళ్లు, చేతులు రెండింటికి కలిపి ఏకంగా 24 వేళ్లు ఉండటం విశేషం. కోవెలకుంట్ల పట్టణ శివారులోని స్వామినగర్ కాలనీకి చెందిన ముద్దుకృష్ణ, వెంకటలక్ష్మి దంపతులకు నాలుగేళ్ల కుమారుడు మంజిత్ సంతానం. పుట్టుకతోనే ఈ బాబుకు ఒక్కోచేతికి ఆరు వేళ్ల చొప్పున రెండుచేతులకు 12 వేళ్లు, ఒక్కో కాలికి ఆరువేళ్ల చొప్పున రెండు కాళ్లకు 12 వేళ్లు ఉన్నాయి. బాలుడికి 24 వేళ్లు ఉండటం అరుదైన సంఘటనగా కాలనీ వాసులు పేర్కొంటున్నారు.

– కోవెలకుంట్ల

### తల్లిదండ్రుల నుంచి తప్పిపోయిన బాలిక

అశ్వినా

**కర్నూలు:** తల్లిదండ్రుల నుంచి తప్పిపోయిన ఓ బాలికను పోలీసులు చేరదీశారు. వివరాలు అడిగితే తండ్రి పేరు ఇర్ఫాన్, తన పేరు అశ్వినా అని, శ్రీచైతన్య పాఠశాలలో చదువుతున్నట్లు చెబుతోంది. గురువారం కర్నూలు ఎ.క్యాంప్‌లో ఉన్న పార్కు దగ్గర ఏడ్చుకుంటూ ఉండగా మూడో పట్టణ పోలీసులు చేరదీసి స్టేషన్‌కు తీసుకెళ్లారు. నివాసం ఎక్కడుందని ప్రశ్నించినా.. చెప్పలేకపోతోంది. ప్రస్తుతం ఈ బాలిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఉంది. సమాచారం తెలిసినవారు సీఐ సెల్ 9121101061 నంబర్, అలాగే పోలీస్ స్టేషన్ 08518–277187 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

# నామినేషన్ల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**కర్నూలు (సెంట్రల్):** జిల్లాలో జరుగుతున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఆర్వోలను ఆదేశించారు. జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియపై గురువారం ఆర్వోలు, ఆర్డీవోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ల కేంద్రాల పరిసరాల్లో పరిస్థితిని సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గమనించిన అంశాలపై ఆమె మాట్లాడుతూ నామినేషన్ల కేంద్రాల వద్ద అభ్యర్థులు, వారి ప్రతినిధులు పెద్ద సంఖ్యలో గుమిగూడకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రాల ప్రధాన గేటు వెలుపల షామియానాలు ఏర్పాటు చేసి, కుర్చీలు, తాగునీటి సదుపాయం కల్పించాలని సూచించారు. అభ్యర్థులు, వారి ప్రతినిధులు వచ్చిన వెంటనే టోకెన్లు జారీ చేసి, నామినేషన్ల కేంద్రం లోపలికి ఒకేసారి పరిమిత సంఖ్యలో మాత్రమే అనుమతించాలని తెలిపారు. నామినేషన్ పత్రాల ప్రాథమిక పరిశీలన సమయంలో పత్రాల్లో లోపాలు, పూరించాల్సిన వివరాలు, సెక్యూరిటీ డిపాజిట్ చెల్లింపు వంటి అంశాలను పరిశీలించేందుకు కనీసం మూడు నుంచి నాలుగు ప్రత్యేక వెరిఫికేషన్ టేబుళ్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. నామినేషన్ల దాఖలుకు వచ్చే వారి సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున, అభ్యర్థులు ఎక్కువ సేపు వేచి ఉండకుండా అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలన్నారు. ఎన్నికల నిబంధనలను పాటిస్తూ, ఎలాంటి పక్షపాతానికి తావులేకుండా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.

**అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయండి..**

జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ నామినేషన్ల ప్రక్రియలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా డాక్యుమెంట్ వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, అవసరమైన చోట అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కొన్ని కేంద్రాల్లో డాక్యుమెంట్ వెరిఫికేషన్‌కు ఒకే కౌంటర్ ఏర్పాటు చేయడం వల్ల అభ్యర్థులు ఎక్కువసేపు వేచి ఉండాల్సి వస్తుందని గుర్తించినట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, ఆర్డీవోలు సందీప్ కుమార్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్
(భారత ప్రభుత్వ రంగ సంస్థ ...విశ్వసనీయ భాగస్వామి)
CO- SAM (స్ట్రెస్డ్ అస్సెట్ మేనేజ్‌మెంట్)
[illegible]
ఈ-మెయిల్ : cs8332@pnb.co.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు వేలం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 8(6) r/w 9(1) నిబంధనలతో చదువబడే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ రూల్స్ 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఈ-వేలం అమ్మకం నోటీసు

[illegible]

ఈ-వేలం తేది, సమయం : 26-11-2026
ఉ॥ గం॥ 11.00 నుండి సా॥ గం॥ 4.00 వరకు

[illegible] : 26.11.2026, మధ్యాహ్నం గం॥ 03.00ల లోపు

[illegible] & 6588006700000252

# 26-154-[illegible]-518501. 2. [illegible] 1-12 [illegible]-518501. 3. [illegible] 75-2-26 [illegible]-518003. 4. [illegible]-518003.

బ్రాంచ్ ఆఫీస్ : 658900-నంద్యాల

సర్ఫేసి చట్టం 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు తేది. : 17-06-2026
సర్ఫేసి చట్టం 2002 యొక్క సెక్షన్ 13(4) క్రింద డిమాండ్ నోటీసు తేది. : 19-08-2026
[illegible] తేది : తేది.19-08-2026

బకాయి : తేది.30-09-2026 నాటికి బకాయి రూ.10,53,300.50 పై. + [illegible]

[illegible] తేది: 06-03-2009 [illegible] నెం.1085/2009 [illegible] సర్వే నెం. 234/1 [illegible] నెం.7, [illegible] : 01 [illegible] 259 [illegible] నెం.6, [illegible] నెం. 36. [illegible] : 37 [illegible] : 35.6 [illegible] : 20 [illegible] : 20 అడుగులు.

రిజర్వు ధర : రూ.15,25,000/-
ధరావత్తు : రూ.1,52,500/-
బిడ్ పెంపుదల మొత్తం : రూ.10,000/-

[illegible] : [illegible] ఏమి లేవు.

ఈ-వేలం నియమ నిబంధనలు :
1) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని నియమ & నిబంధనలు [illegible]
2) [illegible]
3) [illegible]
4) [illegible] https://baanknet.com [illegible] తేది.26-11-2026, [illegible] గం.11-00 ల నుండి సాయంత్రం గం.4-00 ల వరకు నిర్వహించబడును.
5) [illegible] https://baanknet.com & www.pnbindia.in [illegible]

సర్ఫేసి చట్టం 2002 లోని రూలు 8(6) r/w 9(1) ప్రకారం [illegible] అమ్మకం ప్రకటన

తేది : 17-10-2026, ప్రదేశం: విజయవాడ
సం/- అధీకృత అధికారి, పంజాబ్ నేషనల్ బ్యాంక్

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

FLAT FOR SALE

■ 3BHK flat for sale flat 402, Brundawan 1block 1545 sft, car parking, cupboards and 24hours water, Ashok nagar, Kurnool. Cell:9849802717.
[C-1349902]

SERVICES

■ [illegible] కంపెనీ అన్ని రకాల రుణాల సలహాలు అందిస్తుంది. ఇల్లు, ప్రాజెక్ట్, వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార, గృహ, గ్రూప్ రుణాల సలహాలు. ఏజెంట్లకు స్వాగతం. 8961920779
[G-46]

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్‌క్యాష్, షిఫ్టింగ్ చేయబడును. గోల్డ్ ట్రేడింగ్ కంపెనీ. సెల్: 7382114647.
[A-1811]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లైయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
70750 09165
70750 09185